

పాడి ఆవుల మృత్యువాత

పిడుగుపాటుతో పాడి ఆవులు మృతిచెందిన సంఘటన కొందుర్గు మండలంలోని తంగెళ్ల పల్లిలో చోటుచేసుకుంది. 8లో▸



ఆర్థికాభివృద్ధికి కృషి

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. 8లో▸



'సోషల్'గా 'సైబర్'లోకి!

సోషల్ మీడియాలో వచ్చే వ్యక్తిగత వివరాలను గమనించే సైబర్ నేరగాళ్లు వాటి ఆధారంగా టార్గెట్లను ఎంచుకుంటున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేలా కృషి

జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

షాబాద్: గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గ్రామాల్లో నీటి సరఫరా చేసే నీటి సహాయకులకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను ఈఈరాజేశ్వర్, డీఈ హారికతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి పంపులను వాడుకలోకి తీసుకు వచ్చే బాధ్యత వాటర్‌మెన్‌లదేనని అన్నారు. పైపుల లీకేజీలు, సింగిల్, త్రీఫేజ్ మోటార్ల స్టాటర్లు రిపేరు చేయడంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆధునిక సాంకేతిక పద్ధతులు ఎన్నో అందుబాటులోకి వచ్చాయని, వాటిపై వాటర్‌మెన్లు, సిబ్బంది అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో నీటిని సకాలంలో, సక్రమంగా, ఎలాంటి ఇబ్బందులు రాకుండా అందించడంలో వాటర్‌మెన్ పాత్ర కీలకమన్నారు. శిక్షణలో భాగంగా గ్రామంలో నీటి సరఫరా పథకం కోసం చిన్నపాటి మరమ్మతులు, బోరు బావులు, చేతి పంపు బోర్ పంపులు, సింగిల్ త్రీఫేస్ మోటార్లు, హెచ్‌ఎస్‌సీ ట్యాప్, పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు నీటి నాణ్యతపై అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అపర్ణ, గీత, స్రవంతి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ లీగల్ సెల్ జిల్లా చైర్మన్‌గా భిక్షపతి గౌడ్



అబ్దుల్లాపూర్‌మెట్: పీసీసీ లీగల్ సెల్ జిల్లా చైర్మన్‌గా హయత్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భిక్షపతి గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ జారీ చేసిన నియామక పత్రాన్ని మంగళవారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ చేతుల మీదుగా గాంధీ భవన్‌లో అందుకున్నారు. ఈ సందర్భంగా భిక్షపతి గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. న్యాయవాదుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారమయ్యేలా పనిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు తోటి న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

షాద్‌నగర్ డీఐగా ప్రశాంత్



షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ పట్టణ పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ)గా ప్రశాంత్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో ఏసీబీ విభాగంలో పని చేసిన ప్రశాంత్ షాద్‌నగర్‌కు బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ డీఐగా పని చేసిన రామిరెడ్డి దళిత మహిళపై దాడి ఘటనలో సస్పెండ్ అయిన విషయం విదితమే. కొన్ని రోజులుగా ఖాళీగా ఉన్న ఈ స్థానాన్ని అధికారులు భర్తీ చేస్తూ డీఐగా ప్రశాంత్‌ను నియమించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



గునుగల్‌లో మొక్కల పెంపకం గురించి అడిగి తెలుసుకుంటున్న అధికారులు

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంగళవారం ఉన్నతాధికారుల బృందం పరిశీలించింది. రాష్ట్ర పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్, ఉద్యాన శాఖల అధికారులు శిల్ప, ఆకృతి, శరత్‌బాబు, నర్సింహారావు తదితరుల బృందం గునుగల్, గడ్డమల్లయ్యగూడ, చౌదర్‌పల్లి, యాచారం గ్రామాల్లో పర్యటించింది. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పండ్లతోటలు, బృహత్ పల్లె ప్రకృతి వనం, పల్లె ప్రకృతి వనం, కమ్యూనిటీ ప్లాంటేషన్‌ను వారు పరిశీలించారు. అనంతరం యాచారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి నిధుల ఖర్చు, ఉపాధి పొందుతున్న కూలీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరిహారం చెల్లింపులో అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్న తాడిపర్తిలోని భూదాన్ భూమి

'ఫార్మా'పై నజర్

ఫార్మాసిటీ భూసేకరణ, పరిహారం చెల్లింపులపై సర్కార్ దృష్టి

- ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటుకు రంగం సిద్ధం
- అత్యధికంగా అసైన్డ్, ప్రభుత్వ, భూదాన్ భూముల్లో అక్రమాలు జరిగినట్లు అనుమానం
- అప్పటి నోటిఫికేషన్లు, అవార్డులు, రైతుల పేర్లతో కూడిన చెక్కుల చెల్లింపులపై విచారణ

యాచారం: ఫార్మాసిటీ భూసేకరణ, పరిహారం చెల్లింపులపై కాంగ్రెస్ సర్కార్ విచారణకు సిద్ధమైనట్లు సమాచారం. బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో రూ. కోట్లాది పరిహారం సొమ్మును అధికారులు, మధ్యవర్తులు కుమ్మక్కై కాజేశారని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో పరిహారం చెల్లింపుల విషయమై పూర్తి స్థాయి విచారణకు నిర్ణయించినట్లు తెలిసింది. తాజాగా సర్కార్‌లోని ఓ కీలక నేత ఫార్మాసిటీ భూ బాధితుల ఫిర్యాదు మేరకు గతంలో జరిగిన పరిహారం చెల్లింపుల అక్రమాలు, అవకతవకలపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అప్పటి అధికారుల అండదండలతో రూ.లక్షలాది నిధులు కాజేసిన మధ్యవర్తులు మళ్లీ అమాయక రైతులను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని సర్కార్‌కు నివేదికలు అందాయి.

బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో..

యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల్లోని 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేయడానికి గత బీఆర్‌ఎస్ సర్కార్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. భూసేకరణ ప్రక్రియకు 2016లోనే సంకల్పించి నోటిఫికేషన్లు వేయడం ప్రారంభించింది. ఇందులో భాగంగా యాచారం మండలం నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో 9,851 ఎకరాల అసైన్డ్, పట్టా భూమిని సేకరించాలని నిర్ణయించింది. ఇప్పటికే 7,640 ఎకరాల పట్టా, అసైన్డ్ భూమిని సేకరించి రైతులకు పరిహారం అందజేసింది. ఫార్మాసిటీకి పట్టా భూములు ఇచ్చేది లేదని 2,211 ఎకరాలకు సంబంధించి రైతులు కోర్టుకు వెళ్లారు.

2020 నుంచే అక్రమాలు..

భూసేకరణలో 2020 నుంచే పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, రూ. కోట్లాది నిధులు దుర్వినియోగం అయినట్లు అప్పట్లోనే అనేక ఆరోపణలు వచ్చాయి. అప్పటి సర్కార్ భూసేకరణను వేగవంతం చేయాలనే ఆదేశాలతో అధికారులు ఇష్టానుసారంగా అనర్హులకు పరిహారం చెల్లింపులు చేశారు. 2020–2023 మధ్య ఓ అధికారి నిబంధనలు ఉల్లంఘించి చెల్లింపులు చేస్తున్నాడని అప్పట్లో మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. ఫార్మాసిటీ వ్యతిరేకతను తగ్గించడానికి అప్పట్లోని అధికారులు, ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులు సూచించినవారికి రూ.లక్షల్లో పరిహారం అందజేసినట్లు ఆరోపణలు వచ్చాయి. తాడిపర్తి గ్రామంలోని సర్వేనంబర్ 104లోని 250 ఎకరాలు భూదాన్ భూమి అని తెలిసినప్పటికీ, హైకోర్టులో కేసుండగా, నిబంధనలకు విరుద్ధంగా 168 ఎకరాలకు సంబంధించి పరిహారం అందజేశారు. పరిహారం పొందిన రైతుల్లో అత్యధికంగా స్థానికేతరులే ఉన్నారు. సర్వేనంబర్ 104లోని భూదాన్ భూమికి సంబంధించి స్థానికేతరులకు పరిహారం ఇవ్వడమే కాక, మీరాఖాన్‌పేట మెగా హెచ్‌ఎండీఏ వెంచర్‌లో 121 గజాల చొప్పున ప్లాట్ల సర్టిఫికెట్లు ఇవ్వడానికి అప్పటి అధికారులు ప్రయత్నం చేయగా తాడిపర్తి గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించి అడ్డుకున్నారు. తాడిపర్తిలోనే కాకుండా నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లోని అసైన్డ్, ప్రభుత్వ భూములకు నిబంధనలకు విరుద్ధంగా పరిహారం అందజేశారని, అధికారులు దండిగా దండుకున్నారని అప్పట్లోనే బహిరంగ విమర్శలు వచ్చాయి.

నిగ్గు తేల్చేలా విచారణ..

అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీ భూసేకరణపై విచారణ చేయిస్తామని చెప్పిన మాట ప్రకారం విచారణకు సిద్ధమైనట్లు తెలిసింది. అధికారంలో ఉన్న కొందరు పెద్దలు ఫార్మాసిటీ భూసేకరణపై విచారణ చేపట్టాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కోరగా ఆయన సానుకులంగా స్పందించినట్లు సమాచారం. ఓ ఉన్నత స్థాయి కమిటీ వేసి విచారణ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. 2020 నుంచి 2023 మధ్యలో ఎన్ని నోటిఫికేషన్లు వచ్చాయి.. ఎన్ని అవార్డులు పాస్ చేశారు.. ఎంత మందికి పరిహారం చెక్కులు ఇచ్చారు.. చెక్కులు పొందిన రైతులు నిజంగానే అసైన్డ్ పట్టాదారులా లేక బినామీలా అని నిగ్గు తేల్చనున్నారు. పక్షం రోజులుగా ఉన్నతస్థాయి విచారణ అధికారులు ఫార్మాసిటీ భూసేకరణలో నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో 2020 నుంచి 2023 వరకు జరిగిన పరిహారం చెల్లింపులపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత కాంగ్రెస్ పెద్దలు ఫార్మాసిటీలో అక్రమాలకు పాల్పడిన కొందరు అధికారుల పేర్లతో కూడిన నివేదికను సైతం సర్కార్‌కు అందజేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఫార్మాసిటీ భూసేకరణపై విచారణ చేస్తే పెద్ద కుంభకోణమే వెలుగులోకి వస్తుందని అప్పటి అధికారులు, మధ్యవర్తుల్లో భయం పట్టుకున్నట్టు తెలుస్తోంది.

మెగా ప్లాంటేషన్‌కు రెడీ

- ఆయిల్‌పాం సాగుపై ప్రభుత్వం దృష్టి
- ఈ దిశగా రైతులకు ప్రోత్సాహం
- నేడు జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటేలా కార్యక్రమం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఉద్యాన శాఖ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆయిల్‌పాం సాగుతో రైతులకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని ప్రభుత్వం గుర్తించింది. ఈ దిశగా రైతులను ప్రోత్సహించేందుకు సంకల్పించింది. ఇప్పటికే జిల్లాలోని పలు ప్రాంతాల్లో అధికారులు రైతులను గుర్తించారు. ఉద్యానవన శాఖ, సెరీ కల్చర్ ఆధ్వర్యంలో మెగా ప్లాంటేషన్‌కు శ్రీకారం చుట్టారు. పండ్లతోటలు, కూరగాయలే కాకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించారు. తక్కువ నీటితో ఎక్కువ లాభాలు వచ్చే విధంగా ఇలాంటి సాగుకు సమయత్తం చేశారు.

రైతులకు రాయితీ

జిల్లాలో బుధవారం మెగా ప్లాంటేషన్ కార్యక్రమం చేపట్టనున్నారు. 17,000 మొక్కలు ఏకకాలంలో నాటడానికి సర్వం సిద్ధం చేశారు. 18 మండలాలు, 52 గ్రామాలు, 95 మంది రైతుల పొలాల్లో 304 ఎకరాల్లో మొక్కలు నాటనున్నారు. ఇప్పటికే దాదాపు అన్ని ప్రాంతాల్లో గుంతలు తవ్వి మొక్కలు తెప్పించారు. ప్రభుత్వం అధికారికంగా నేడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. ఇందుకు గాను రైతులకు సూక్ష్మసేద్యం (డ్రిప్పు) పరికరాలు ఇవ్వనున్నారు. నేలలు, వాతావరణం అనుకూలత దృష్ట్యా దీర్ఘకాల పంట అయిన ఆయిల్‌పాం సాగును త్రికోణ, చతురస్రాకార పద్ధతుల్లో చేపట్టనున్నారు. త్రికోణ పద్ధతిలో ఎకరానికి 57, చతురస్రాకార పద్ధతిలో 50 మొక్కలు నాటుకోవచ్చని అధికారులు సూచించారు. మొక్కలకు మొదటి సంవత్సరం ఎకరాకు రూ.11,600, ఎరువులు అంతర పంటకు మొదటి సంవత్సరం నుంచి నాలుగో సంవత్సరం వరకు ఎకరానికి రూ.4,200 రైతులకు రాయితీగా అందజేస్తారు. సాగు విస్తీర్ణత పెంచే లక్ష్యంతో రాయితీ పోను మొక్కకు రూ.20 చొప్పున రైతు వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. ఔత్సాహిక రైతులు తమ ప్రాంత ఉద్యానవన శాఖ, అగ్రికల్చర్, ఎక్సైజ్‌శాఖ అధికారులను సంప్రదించాలి.



ప్లాంటేషన్ కోసం సిద్ధం చేసిన మొక్కలు

హాజరుకానున్న ఎమ్మెల్యేలు, అధికారులు

మెగా ప్లాంటేషన్‌లో భాగంగా మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, మాడ్గుల, చేవెళ్ల, మొయినాబాద్, కేశంపేట ప్రాంతాల్లో మొక్కలు నాటనున్నారు. ఈ కార్యక్రమానికి ఎక్కడికక్కడ ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, ఉద్యానవన శాఖ జిల్లా అధికారులు, స్థానిక అధికారులు పాల్గొననున్నారు.

విజయవంతం చేయాలి



జిల్లాలో రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఒకేసారి పెద్ద సంఖ్యలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగే ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలి.

– సురేష్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

పెద్దఅంబర్‌పేట చైర్‌పర్సన్ తొలగింపు

- ఉత్తర్వులు జారీచేసిన మున్సిపల్ శాఖ
- పదవి నుంచి తప్పుకోనున్న చెవుల స్వప్న
- కొత్త చైర్‌పర్సన్ ఎన్నికపై ఖరారు కాని తేదీ

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి నుంచి చెవుల స్వప్నను తొలగిస్తూ మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 13న జరిగిన అవిశ్వాస పరీక్షలో 17 మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఓటు వేసిన నివేదికను ఆధారంగా తీసుకున్న మున్సిపల్ అధికారులు చెవుల స్వప్నను అనర్హురాలిగా పరిగణిస్తూ ఆ పదవి నుంచి ఆమెను తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తచైర్‌పర్సన్ ఎన్నిక కోసం అధికారులు తేదీని ఎప్పుడు ప్రకటిస్తారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న చైర్‌పర్సన్ స్థానంలో కొత్త చైర్‌పర్సన్ ఎన్నికయ్యే వరకూ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా వైస్‌చైర్‌పర్సన్ చామ సంపూర్ణకు బాధ్యతలు అప్పగించేందుకు ఏ నిర్ణయం తీసుకుంటారనేది తెలియాల్సి ఉంది. కాగా చెవుల స్వప్న స్థానంలో కొత్తగా చైపర్సన్ రేసులో పెద్దఅంబర్‌పేటకు చెందిన కౌన్సిలర్ పందుగుల జయశ్రీ ఒక్కరే ఉన్నారు. ఆమె ఎన్నిక లాంఛనమేనని స్థానికంగా చర్చించుకుంటున్నారు.



చెవుల స్వప్న

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు



అధికారులతో సమావేశమైన మంత్రి శ్రీధర్‌బాబు

- వైద్య సిబ్బంది సెలవులు రద్దు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు

రంగారెడ్డి జిల్లా: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల నియంత్రణ, చికిత్స కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. వైద్యులు, సహాయక సిబ్బంది సెలవులు తీసుకోకుండా హెల్త్ సెంటర్లు, ఆస్పత్రుల్లో రోజంతా అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మంగళవారం ఆయన బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురుస్తున్న వర్షాలకు దోమలు విజృంభించి ప్రతీ ఇంటికి ఒకరు జ్వరం బారిన పడ్డారని శ్రీధర్‌బాబు చెప్పారు. అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచాలని.. సంచార వైద్యశాలలు ప్రతీ గ్రామానికి వెళ్లేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు, జిల్లా ఆస్పత్రుల్లో మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరించి దగ్గర్లోని ఆస్పత్రులను తరలించేలా వైద్యాధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. పసి పిల్లలు, గర్భిణులు, వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. డెంగీ, చికున్‌గున్యాలకు కారణమయ్యే దోమల నియంత్రణకు యాంటీ లార్వా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని అన్నారు. ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ శశాంక, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు

డీఆర్‌డీఓ శ్రీలత

షాద్‌నగర్‌రూరల్: మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఓ శ్రీలత అన్నారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అనురాధ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా మరింత ఎదిగేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. సమావేశంలో ఏపీడీ సూర్యారావు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు స్వర్ణలత, బాల్‌రాజ్, విశాల్‌రావు, ఏపీఎం నగేష్, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'రియల్' రగడ



రాళ్లు రువ్వుతున్న వెంచర్ నిర్వాహకులు

- తమ భూమిని ఆక్రమించారని సీలింగ్ రైతుల ఆరోపణ
- న్యాయబద్ధంగా కొనుగోలు చేశానంటున్న వ్యాపారి
- వెంచర్ హద్దురాళ్లను తొలగించేందుకు వెళ్లిన రైతులు
- అడ్డుకున్న నిర్వాహకులు
- పరస్పర దాడి.. పలువురికి గాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్: రైతులు, రియల్ ఎస్టేట్ వెంచర్ నిర్వాహకుల మధ్య నెలకొన్న ఘర్షణ.. పరస్పర దాడులకు దారి తీసింది. వ్యాపారులు తమ భూమిని ఆక్రమించారని రైతులు.. తాము న్యాయబద్ధంగా కొనుగోలు చేశామని వెంచర్ నిర్వాహకులు పేర్కొంటున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి ఇరువర్గాల వారు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పిగ్లీపూర్ సర్వే నంబర్ 17/1లోని సుమారు 42 ఎకరాల భూమిలో గోపాల్ యాదవ్ అనే వ్యక్తి మూడేళ్లుగా వెంచర్ అభివృద్ధి చేస్తూ ప్లాట్లు విక్రయిస్తున్నాడు. గ్రామానికి చెందిన మల్లయ్య, నర్సింహతో పాటు బాటసింగారం గ్రామానికి చెందిన ఆకుల సత్యనారాయణ, వెంచర్ నిర్వాహకులకు మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో వారం రోజుల క్రితం వెంచర్ వద్దకు వచ్చిన రైతులు గొడవ చేసేందుకు ప్రయత్నించడంతో నిర్వాహకులు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరిగి మంగళవారం డోజర్‌తో వచ్చిన రైతులు వెంచర్‌లోని రోడ్లను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. అక్కడే ఉన్న గోపాల్ యాదవ్, అతని అనుచరులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మొదలైన వాగ్వాదం కర్రలు, కంకర రాళ్లతో దాడి చేసుకునే వరకూ వెళ్లింది. ఈ ఘటనలో ఇటు రైతులు, అటు గోపాల్‌యాదవ్ అనుచరులకు గాయాలయ్యాయి. ఇరువర్గాల వారు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



రాళ్లదాడిలో గాయపడ్డ రైతు

ఆక్రమించుకున్నారు..

పిగ్లీపూర్ సర్వేనంబర్ 17లోని సీలింగ్ భూములను నలభై ఏళ్ల క్రితం ప్రభుత్వం మాకు ఇచ్చింది. నాటి నుంచి ఇందులో పంటలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. మా ఆధీనంలో ఉన్న సీలింగ్ భూమలను గోపాల్‌యాదవ్ ఆక్రమించుకున్నాడు. ఇందులో ప్లాట్లు చేసి విక్రయిస్తున్నాడు. అడ్డుకోవడానికి వెళ్లిన ప్రతీసారి తన అనుచరులతో దాడి చేయిస్తున్నాడు.

– సీలింగ్ భూముల రైతులు

ఆ అవసరం లేదు

సీలింగ్ భూములను ఆక్రమించాల్సిన అవసరం లేదు. సర్వేనంబర్ 17/1లోని పట్టా భూములనే కొనుగోలు చేశా. హెచ్‌ఎండీఏ, రెరా అనుమతులతో వెంచర్ నిర్మించా. భూమిని కొనుగోలు చేయడానికి ముందే రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి, అన్ని రిపోర్టులు తీసుకున్నా. ఇటీవల ఘర్షణకు దిగిన రైతులే స్వయంగా తమ భూమి ఆకులగుట్టలో ఉందని, ఈ వెంచర్‌లో లేదని కలెక్టర్‌కు రాసిచ్చారు. ఇప్పుడు ఉద్దేశపూర్వకంగా గొడవ చేస్తున్నారు.

– గోపాల్ యాదవ్, వెంచర్ నిర్వాహకుడు

డబ్బుల విషయంలో సోదరుల గొడవ

అనుమానాస్పదస్థితిలో అన్న మృతి

మొయినాబాద్: డబ్బుల విషయంలో అన్నదమ్ములు రాత్రి గొడవ పడ్డారు. తెల్లారే సరికి అన్న అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన దాసర్ల యాదయ్య (45), అతని తమ్ముడు దాసర్ల సంజీవ, తల్లి జంగమ్మతో కలిసి కొన్నేళ్లుగా మొయినాబాద్ మండలం నాగిరెడ్డిగూడలో ఉంటూ కూలి పని చేసుకుంటున్నారు. సోమవారం రాత్రి డబ్బుల విషయంలో అన్నదమ్ములు గొడవ పడ్డారు. తరువాత ఎవరికి వారు ఇంట్లో పడుకున్నారు. మంగళవారం ఉదయం 7 గంటలు దాటినా యాదయ్య నిద్రలేవకపోవడంతో అతని కూతురు శైలజ వెళ్లి లేపడానికి ప్రయత్నించింది. అప్పటికే యాదయ్య మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



యాదయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి జంగమ్మ



పగలు ఎండ.. సాయంత్రం వాన

ఇబ్రహీంపట్నంలో కురుస్తున్న వర్షం

ఇబ్రహీంపట్నం: కొద్ది రోజులుగా ఇబ్రహీంపట్నం మండలంలో విచిత్రమైన వాతావరణం కనిపిస్తోంది. పగలంతా ఎండ కొడుతుండగా.. సాయంత్రం వేళ వర్షం కురుస్తోంది. గత శుక్రవారం 16.4 మిల్లీమీటర్లు, శనివారం 20.8 ఎంఎం, ఆదివారం 14.3 ఎంఎం, సోమవారం 10.7 ఎంఎం, మంగళవారం 20 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఆరుగురు జూదరుల అరెస్టు

ఇబ్రహీంపట్నం రూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిబట్ల పోలిస్‌స్టేషన్ పరిధిలోని రావిర్యాల్ గ్రామ శివారులోని ఓ ఇంట్లో కొందరూ వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ పోలీసులు, ఆదిబట్ల పోలీసులు సంయుక్తంగా సోమవారం రాత్రి దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.40,280లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లుగా సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



సాయిగౌడ్ (ఫైల్)

కందుకూరు: సొంతంగా కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్న యువకుడిని విద్యుదాఘాతం బలితీసుకుంది. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కందికంటి బాబయ్యగౌడ్‌కు ఇద్దరు కుమారులు, చిన్నవాడైన సాయిగౌడ్(22) ఇంటర్ చదివాడు. సొంతంగా ఏదో ఒక పని చేసుకోవాలని నిర్ణయించుకొని, విస్తర్లు తయారు చేసే మిషన్ కొనుగోలు చేశాడు. దాన్ని గ్రామంలోని ఓ షటర్‌లో పెట్టుకుని ఉపాధి పొందుతున్నాడు. రోజూ మాదిరిగానే మంగళవారం షటర్ తెరిచి పనులు ప్రారంభించాడు. ఉదయం 11 గంటల సమయంలో మిషన్ వద్ద పని చేస్తుండగా కరెంట్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. లేమూరుకు సమీపంలోని భైరాగిగూడలో ఉండే మృతుడి బావ కృష్ణ ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయకపోవడంతో మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో అక్కడకు వచ్చి చూడగా అచేతనంగా పడి ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించి, 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

‘సోషల్’గా ‘సైబర్’లోకి!

సోషల్ మీడియా ఖాతాల్లో వ్యక్తిగత వివరాల పోస్టు

- ఫోన్ నంబర్ల ద్వారా వీటిని సంగ్రహిస్తున్న నేరగాళ్లు
- ఆపై పిల్లల కిడ్నాప్, వారిపై కేసుల పేరుతో ఫోన్‌కాల్స్
- వాట్సాప్ డీపీలుగా పోలీసు అధికారుల ఫొటోలు
- నగరంలో హఠాత్తుగా పెరిగిన బెదిరింపు వ్యవహారాలు





నేరగాళ్లు డీపీగా వాడిన పోలీసు అధికారుల ఫొటోలు



లంగర్‌హౌస్: నగరానికి చెందిన మల్లికార్జున్‌రెడ్డికి ఓ ఫోన్‌కాల్ వచ్చింది. మహారాష్ట్ర పోలీసు అధికారి పరమ్‌బీర్ సింగ్ ఫొటోను డీపీగా పెట్టుకున్న అవతలి వ్యక్తి విజయ్‌కుమార్ పేరుతో మాట్లాడాడు. ‘మీ కుమారుడితోపాటు కొందరు నా కస్టడీలో ఉన్నారు, వారిపై డ్రగ్స్ కేసు నమోదు చేస్తున్నాం. కుమారుడితో మాట్లాడిస్తా’ అంటూ వారిని కొట్టినట్లుగా శబ్దాలు వినిపించాడు. రూ.15 లక్షల చెల్లిస్తే కేసు ఉండదని బెదిరించాడు.

◆ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా వేదికల వినియోగం విశృంఖలం కావడం... నెటిజనులు తమ కుటుంబం, పిల్లల గురించి, అభిరుచులు, విద్య, ఉద్యోగం.. ఇలా ప్రతి అంశాన్నీ, ఫొటోలను వాటిల్లో పోస్టు చేయడం వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలకు ఉదాహరణ ఇది. గత వారంరోజులుగా ఈ తరహా బెదిరింపు ఫోన్ కాల్స్ ఆందోళనకర స్థాయిలో పెరిగాయి.

వాటి ద్వారానే కీలక ఆధారాలు...

సోషల్ మీడియాలో వచ్చే వ్యక్తిగత వివరాలను నిశితంగా గమనించే సైబర్ నేరగాళ్లు వాటి ఆధారంగానే టార్గెట్లను ఎంచుకుంటున్నారు. టార్గెట్ చేసిన వ్యక్తికి ఎందరు పిల్లలు? వాళ్లు ఏం చేస్తున్నారు? అలవాట్లు ఏంటి? అనే అంశాలను కొన్నాళ్లుగా పరిశీలిస్తున్నారు. టార్గెట్ చేసిన వ్యక్తులను సంప్రదించడానికి అవసరమైన ఫోన్ నెంబర్ సైతం అనేక సందర్భాల్లో సోషల్ మీడియా ద్వారానే సైబర్ నేరగాళ్లకు చేరుతున్నాయి.

వర్చువల్ నంబర్లతో కాల్స్...

సైబర్ నేరగాళ్లు కొన్ని రకాలైన యాప్స్ నుంచి వర్చువల్ నెంబర్లు యాక్టివేట్ చేసుకుంటున్నారు. వీటిలో +92తో మొదలయ్యే పాకిస్థాన్ సహా అన్ని దేశాలవి ఉంటున్నాయి. వీటి డీపీలుగా ముంబై సహా వివిధ నగరాలకు చెందిన పోలీసు అధికారుల ఫొటోలను ఇంటర్‌నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసి పెట్టుకుంటున్నారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మీ పిల్లల్ని కిడ్నాప్ చేశామనో, వారు నేరం చేస్తూ చిక్కారనో, కేసు పెడుతున్నామనో చెప్తున్నారు. ఎదుటి వాళ్లు తేరుకునే, వెనుకాముందు ఆలోచించే సమయం ఇవ్వకుండా తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తమ వద్ద బందీగా ఉన్న వారిని తిరిగి పంపాలన్నా, కేసు లేకుండా చేయాలన్నా డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలా కొందరి నుంచి వసూలు కూడా చేస్తున్నారు. ఇలాంటి నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

“ నా కుమార్తెపై డ్రగ్స్ కేసు..



ఉన్నతవిద్య కోసం నా కుమార్తెను ఇటీవల హాస్టల్‌లో చేర్పించా. నాలుగు రోజుల క్రితం ఏసీపీని మాట్లాడుతున్నానంటూ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశారు. నా కుమార్తె డ్రగ్స్ సేవిస్తూ చిక్కిందని, కేసు నమోదు చేయకుండా ఉండాలంటే రూ.4 లక్షలు పంపాలని బెదిరించారు. ఆందోళనతో హాస్టల్‌కు ఫోన్ చేసి అసలు విషయం తెలుసుకున్నాకే ఊపిరి పీల్చుకున్నా. రెండు రోజులపాటు ఫోన్లు వస్తూనే ఉన్నాయి. – కల్లూరి స్వామి, ఆర్మీ ఉద్యోగి

‘ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి’

చేవెళ్ల: అసంబద్ధంగా ఉన్న టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. డేవిడ్, ఎండీ మునీర్ పాషా పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యాశాఖ జిల్లా కలెక్టర్లకు ఇచ్చిన టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులతో విద్యార్థులకు నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువగా ఉన్న చోట టీచర్లు తక్కువగా ఉన్నారని, టీచర్లు ఎక్కువగా ఉన్న చోట పిల్లలు తక్కువగా ఉన్నారనే సాకుతో విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులతో ప్రభుత్వ బడులు మూతపడే ప్రమాదం ఎక్కువ అన్నారు. వెంటనే విద్యాశాఖ ఇచ్చిన ఈ ఉత్వర్వులను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో 11 మంది విద్యార్థులు ఉన్న చోట ఇద్దరు ఉపాధ్యాయులని, 60మంది విద్యార్థులు ఉన్న చోట కూడా ఇద్దరే ఉండాలనే ఆదేశాలు ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. పై నిబంధనలను అమలు చేస్తే ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులపై భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ నిర్ణయాన్ని ప్రభుత్వం పునర్ సమీక్షించాలని వారు కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్ రూరల్: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌తో కలిసి 33 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడపడుచులకు ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఎంపీడీవో సంధ్య, మత్స్యకార్మిక చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, మండల అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడిపై దాడికి యత్నం

శంషాబాద్ రూరల్: తనపై కొందరు దాడికి యత్నించి కారు అద్దాలను ధ్వంసం చేశారంటూ ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముచ్చింతల్‌కు చెందిన నర్సింహ మంగళవారం తన కారులో వెళ్తుండగా పీ-వన్ రోడ్డు పక్కన ఉన్న జిమ్స్ ఆసుపత్రి వద్ద కొందరు అతని కారును అడ్డగించి కారు అద్దాలను ధ్వంసం చేశారు. తనపై దాడికి యత్నించిన కత్తుల జనార్దన్‌తో పాటు మరి కొందరిపై చర్యలు తీసుకోవాలని నర్సింహ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు ప్రాణహాని ఉందని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

అత్తాపూర్: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ పిస్తాహౌస్ మంచి పీవీ నరసింహారావు ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్-వే ప్రాంతంలో సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ గుర్తు తెలియని మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతోపాటు మృతదేహం ఒంటిపై లైట్ పింక్ కలర్ షర్ట్, బ్లాక్ పాయింట్ ధరించి ఉందని, మృతుడి ఆచూకీ తెలిసినవారు అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.500 కోట్ల స్థలానికి విముక్తి

బంజారాహిల్స్ ఏసీబీ ఎదురుగా అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఏసీబీ కార్యాలయం ఎదురుగా ప్రభుత్వ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలంటూ ప్రజావాణిలో గుర్తుతెలియని వ్యక్తి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి రెవెన్యూ సిబ్బందితో కలిసి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఏసీబీ కార్యాలయం ఎదురుగా సర్వేనెంబర్ 102/1లో బంజారాకుంజ్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో ఓ గది నిర్మించారని, మరోచోట టెంట్ ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు స్థలాన్ని గతంలోనే జీఓ నెంబర్ 249 కింద క్రమబద్ధీకరించుకోగా, దీనిని నిలిపివేయాలంటూ మరో వ్యక్తి కోర్టు నుంచి స్టే తెచ్చాడని, దీంతో ఈ స్థలంపై క్రమబద్ధీకరణ నిలిచిపోయిందంటూ అప్పటి నుంచి స్థలం రెవెన్యూ ఆధీనంలో ఉందని తహసీల్దార్ తెలిపారు. సుమారుగా 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలం తమదని ఇప్పటికే 10 మందికి పైగా కోర్టులో పోరాడుతున్నారు. ఓ వైపు వీరంతా న్యాయస్థానంలో పిటిషన్లు వేయగా, రోజుకు 10 మంది చొప్పున ఈ స్థలానికి సంబంధించి నకిలీ పత్రాలు తీసుకువచ్చి రూ. లక్షలు దండుకుంటూ దీనిని ఒక వ్యాపారంగా మార్చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.

డెలివరీ బాయ్‌పై దాడికి పాల్పడిన హోటల్ యజమానికి జరిమానా

నాంపల్లి: ఫుడ్ డెలివరీ బాయ్‌పై దాడికి పాల్పడిన హోటల్ నిర్వాహకుడికి రూ.10,050 జరిమానా విధిస్తూ నాంపల్లి కోర్టు తీర్పు చెప్పింది. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అత్తాపూర్, ఫోర్ట్‌వ్యూ కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ నాజర్ ఫుడ్ డెలివరీ బాయ్‌గా పని చేసేవాడు. ఈ నెల 21న అతను వినియోగదారుడి ఆర్డర్ తీసుకునేందుకు మల్లేపల్లిలోని మొయిన్ చాట్నా హోటల్ దగ్గరకు వచ్చాడు. ఆర్డర్ కోసం సుమారు 40 నిమిషాల పాటు హోటల్ ఎదుట నిరీక్షించినా యజమాని ఫుడ్‌ను సకాలంలో అందించకపోగా పదే పదే ఆర్డర్ ఇవ్వాలంటూ చిరాకు పెడతావా అంటూ హోటల్ యజమాని సల్మాన్ హుస్సేన్ షేక్ అబ్దుల్ నాజర్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు న్యాయమూర్తి హోటల్ యజమానికి రూ.10,050 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

పిడుగు పడి.. ఆవుల మృత్యువాత



యాచారం: కిషన్‌పల్లి గ్రామంలో మృతి చెందిన పాడి ఆవులు

కొందుర్గు: పిడుగుపాటుతో ఆవు మృతిచెందిన సంఘటన మండలంలోని తంగెళ్లపల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గొల్ల లింగం తన పాడి ఆవును సోమవారం సాయంత్రం వరకు పొలం వద్ద మేపి రాత్రి పాకలో కట్టేసి ఇంటికి చేరుకున్నాడు. అర్ధరాత్రి వర్షం కురుస్తున్న సమయంలో పొలం వద్ద మంటలు వస్తున్నాయని స్థానికుల ద్వారా సమాచారం అందడంతో పరుగున వెళ్లాడు. అప్పటికే పాకకు నిప్పంటుకుని మంటలు ఎగిసిపడుతున్నాయి. పిడుగుపాటుతోనే లక్ష రూపాయల విలువ చేసే ఆవు మృతి చెందిందని, పాక సైతం కాలి బూడిదైందని స్థానికులు పేర్కొంటున్నారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

యాచారంలో..

యాచారం: పిడుగు పాటుకు రెండు పాడి ఆవులు మృతి చెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి...మండలంలోని మాల్ అనుబంధ గ్రామమైన కిషన్‌పల్లి గ్రామంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. అదే సమయంలో పిడుగు పడి గ్రామానికి చెందిన కలకొండ నర్సింహకు సంబంధించిన రూ. లక్షన్నర విలువ చేసే పాడి ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ విషయంలో రైతును ఆదుకోవాలని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ మంగళవారం యాచారం తహసీల్దార్ అయ్యప్పను కలిసి వినతి పత్రం అందజేశారు. పాడి ఆవులతో జీవనోపాధి పొందే నర్సింహ ఉపాధి కోల్పోయినట్లు తెలిపారు.

పద్మారెడ్డి ఇంటి వద్ద పోలీస్ పికెట్

బంజారాహిల్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మామ పద్మారెడ్డి ఇంటికి పోలీసు భద్రత కల్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్ 10సీలోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో నివసించే సీఎం మామ పద్మారెడ్డి ఇంటి వద్ద భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం పోలీసు అధికారులు పరిశీలించారు. ఆయన ఇంటి వద్ద 24 గంటలు పోలీసు బందోబస్తు ఉండేలా పికెట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటివరకు పద్మారెడ్డి ఇంటి వద్ద ఎలాంటి పోలీసు బందోబస్తు లేదు. తాజాగా ఆయన ఇంటి వద్ద భద్రత ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

మహిళ దారుణ హత్య



శారద మృతదేహం



శారద(ఫైల్)

దుండిగల్: నగలు దోచుకుని ఓ మహిళను దారుణంగా హత్య చేసిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుండిగల్ మున్సిపాలిటీ, మల్లంపేటలోని శ్రీ వంశీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో బొద్దుల శారద(50) తన కుమారుడు సాయి వినయ్‌తో కలిసి నివాసం ఉంటూ స్థానికంగా విఘ్నేశ్వర మిల్క్ పాయింట్‌ను నిర్వహిస్తుంది. ఆమె కుమారుడు సాయి వినయ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 23న ఉదయం అతను తల్లిని మిల్క్ పాయింట్ వద్ద వదిలి డ్యూటీకి వెళ్లిపోయాడు. తిరిగి రాత్రి 8 గంటలకు తల్లికి ఫోన్ చేయగా స్పందన లేకపోవడంతో పక్కనే ఉంటున్న నరేష్‌కు ఫోన్ చేసి చెప్పాడు. అతను వెళ్లి చూసే సరికి శారద బెడ్‌రూమ్‌లో విగతజీవురాలిగా కనిపించడంతో అతను వినయ్‌కు సమాచారం అందించాడు. వినయ్ ఇంటికి వచ్చి చూడగా మృతురాలి ఒంటిపై చెవి కమ్మలు, ముక్కు పుడక కనిపించలేదు. గొంతు నులిమి ఊపిరాడకుండా చేసి హత్య చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. బెడ్ రూమ్‌లో రక్తపు మరకలు ఉన్నాయి. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా శారద ఓ వ్యక్తితో కలిసి మాట్లాడుకుంటూ వచ్చిన దృశ్యాలు కనిపించాయి. నేరుగా బెడ్‌రూమ్‌లోకి వచ్చిన సదరు వ్యక్తితో ఆమెకు సన్నిహిత సంబంధం ఉండి ఉంటుందని, నగల కోసమే హత్య చేశాడా.. లేదా ఇతర కారణాలు ఉన్నాయా.. అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.